ప్రపంచ మహాసభలకు హాజరైన ఉపాధ్యాయుడు

ప్రపంచ మహాసభలకు హాజరైన ఉపాధ్యాయుడు గాండ్ల నర్సింహులు

లింగంపేట, డిసెంబర్ 29: అంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో ఆదివారం నిర్వహించిన 6వ ప్రపంచ మహాసభలకు లింగంపేటకు చెందిన గాండ్ల నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ ప్రపంచ మహాసభల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి తెలుగు పండిత్‌లు, కవులు హాజరయ్యారని చెప్పారు. ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న సైతం హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నర్సింహులుకు శాలువా కప్పి, జ్ఞాపిక అందించి సన్మానించారు.

ప్రతి కార్మికుడు లేబర్ కార్డు చేయించుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 29: భవన నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు చేయించుకోవాలని కార్మిక నాయకులు సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డి బిందర్ మందిరంలో కార్మికశాఖ, సీఎస్‌సీల ఆధ్వర్యంలో కార్మికులకు రక్తపరీక్షలు నిర్వహించారు. కార్మికులకు ఏమైనా సమస్యలు వస్తే వెంటనే తమకు తెలిజేయాలని, సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం అందుబాటులో ఉండి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్‌క్యాంపు జిల్లా మేనేజర్ ప్రవీణ్‌నాయక్, జిల్లా కో-ఆర్డినేటర్ సాయన్న, మండల కార్మిక నాయకులు శ్యాం, తుకారాం, సంగమేశ్వర్, గణేశ్, అబ్దుల్ రజాక్ తదితరులున్నారు.

కామారెడ్డికి తరలివెళ్లిన బుడగ జంగం నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 29: జిల్లా కేంద్రంలో జరిగిన బేడబుడగ జంగం సంక్షేమ సంఘం సమావేశానికి ఆదివారం ఎల్లారెడ్డి పట్టణం నుంచి బుడగ జంగం నాయకులు తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఎల్లారెడ్డి బుడగజంగం నాయకుడు అల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ప థకాలు ఎస్సీ 56 ఉపకులాలకు జనాభా దా మాషా ప్రకారం అందాలన్నారు. ఉపకులా ల ప్రాతిపదికన న్యాయం జరగాలంటే ఎస్సీ ఉపకులాలు ఐక్యంగా ఉండాలన్నారు. తరలివెళ్లిన వారిలో ప్రతినిధులు అల్లం శ్రీనివాస్, టేకు రమేశ్, కళ్లెం సాయిలు, అల్లం పండరి తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు పోసానిపేట్ బాలికలు

రామారెడ్డి, డిసెంబర్ 29 : మండలంలోని పోసానిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఈనెల 30 నుంచి జనవరి 2 వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. జట్టుకు కోచ్‌గా పీఈటీ నరేశ్‌రెడ్డి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

హస్గుల్ పాఠశాల విద్యార్థులు..

బిచ్కుంద, డిసెంబర్ 29: మండలంలోని హస్గుల్ గ్రామ పాఠశాల విద్యార్థులు సీఎం కప్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు సాయికుమార్, ముజామిల్, అమృత, ఇందుప్రియ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ రఘురాం తెలిపారు. మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలపై నీలినీడలు

● తక్కువ మంది విద్యార్థుల పేరుతో మరో చోటికి తరలింపు ● ప్రశ్నార్థకంగా మారిన కళాశాల భవితవ్యం

మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల భవనం

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 29: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు పదో తరగతితోనే బంగారు భవిష్యత్తు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2015లో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు నేడు ఆదరణ కరువైంది. కళాశాల నిర్వహణపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. నూతన కళాశాల భవనం, విద్యార్థుల కోసం సకల సౌకర్యాలు కల్పించగా.. కళాశాలకు అధికారుల నిర్లక్ష్యంతో త్వరలో తాళం పడబోతున్నది. విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారంటూ..ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు అంటూ చడీచప్పుడు లేకుండా ద్వితీయ సంవత్సరం విద్యార్థులను సిద్దిపేట జిల్లా తోర్నాల అగ్రి కళాశాలకు తరలించి ఎన్‌రోల్‌మెంట్ సైతం పూర్తి చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులను జనవరి మొదటి వారంలో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులను ఇక్కడి నుంచి తరలిస్తే.. కోట్లది రూపాయల వ్యయంతో నిర్మించిన కళాశాల భవనం, వసతులు, పన్నెండు ఎకరాల్లో సాగు చేస్తున్న పండ్ల తోటలు, సాగు పంటలు, యంత్రాలు వృథాగా మారుతాయి. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ స్పందించి కళాశాల విద్యార్థులను తరలించకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరలింపు..

కళాశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నది. మొదటి సంవత్సరంలో 20 మందికి 12 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో 20 మందికి 13 మంది విద్యార్థులతో కళాశాల కొనసాగుతున్నది. దీంతో ఖర్చులు పెరిగిపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల క్రితం ద్వితీయ సంవత్సర విద్యార్థులను సిద్దిపేట జిల్లా, తోర్నాల కళాశాలకు పంపించాం. జనవరి మొదటి వారంలో మొద టి సంవత్సరం విద్యార్థులను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కళాశాల నిర్వహణపై మేము ఏమీ చెప్పలేం. వీసీ అల్దాస్ జానియా ఆదేశానుసారం ముందుకు వెళ్తాం.

-మాధవీలత,
పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

మరో కళాశాలకు తరలించడం బాధగా ఉంది..

మాల్తుమ్మెద అగ్రి కళాశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో మరో చోటికి పంపిస్తున్నారు. వారం రోజుల క్రితం రెండో సంవత్సరం విద్యార్థులను సిద్దిపేట జిల్లా, తోర్నాల అగ్రి కళాశాలకు తరలించారు. మమ్మల్ని సైతం జనవరి మొదటి వారంలో పంపిస్తారని అధ్యాపకులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి వెళ్లాలంటే బాధగా ఉన్నది.

-మహ్మద్ రహ్మత్ నవాజ్,
ప్రథమ సంవత్సరం విద్యార్థి

సెమిస్టర్ పరీక్షల తర్వాత మమ్మల్ని పంపిస్తామన్నారు..

వ్యవసాయ పాల్‌టెక్నిక్ కళాశాల నుంచి వారం రోజుల క్రితం రెండో సంవత్సరం విద్యార్థులను మరో చోటికి పంపించారు. సెమిస్టర్ పరీక్షలు ముగియగానే జనవరి మొదటి వారంలో మమ్మల్ని సైతం అదే కళాశాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని చెబుతున్నారు. చదువు కొనసాగడానికి ఇక్కడ విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. అధికారులు స్పందించి కళాశాల ఇక్కడే కొనసాగించేలా చూడాలి.

-నేనావత్ నరేశ్,
మొదటి సంవత్సరం విద్యార్థి

ఇండ్ల విషయంలో దళారులను నమ్మొద్దు

రామారెడ్డి, డిసెంబర్ 29 : పార్టీలు, కులమతాలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం అందజేస్తుందని మాజీ జడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండ్లులేనివారు, పూరి గుడిసెలో నివసించే వారు, ఇండ్లు దగ్ధమైన వారికి అందిస్తామని పేర్కొన్నారు. ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేస్తే అటువంటి వారిని నమ్మవద్దని, వారి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేయాలని సూచించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

గాంధారి, డిసెంబర్ 29: మండల కేంద్రంతో పాటు, చుట్టు పక్కల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే కొనసాగుతున్నది. గాంధారిలో పలు వార్డుల్లో గ్రామంచాయతీ సిబ్బంది ఆదివారం సర్వే నిర్వహించారు. అధికారులు చేపడుతున్న సర్వేను ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పరిశీలించారు. ఇప్పటివరకు దాదాపు 70 శాతం వరకు సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇంది రమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్ బాలయ్య, బాలయ్య, గడ శంకర్,రమేశ్, హైమద్, అల్తాఫ్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

లింగంపేట, డిసెంబర్ 29: ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తున్న సమయంలో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సుధాకర్ వాహనదారులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలపై ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రమాదాలు సంభవిస్తే తలకు గాయాలు కావడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నట్లు వివరించారు. తనిఖీ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకు పంపనున్నట్లు వెల్లడించారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులకు జరిమానా విధించారు. ఎస్సై వెంట స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఫోన్ ఐఎంఈఐ వివరాలను ఉంచుకోవాలి

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 29: సెల్‌ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ తమ వద్ద ఐఎంఈఐ వివరాలను రాసి ఉంచుకోవాలని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన ముగ్గురు బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసి మాట్లాడారు. పట్టణానికి చెందిన దారం కృష్ణమూర్తి, మాలి అశోక్, గుంటిగారి సురేందర్ ఫోన్లు పోగొట్టుకోగా వాటి వివరాలు సీఈఐఆర్‌లో నమోదు చేసి ఈనెల 27న గుర్తించినట్లు తెలిపారు. ఎస్సై తోపాటు కానిస్టేబుల్ రాజేశ్వర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 29: పిట్లం మండలంలోని పిట్లం- మద్దెల చెరువు రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. పిట్లం ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దెల చెరువు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్(58)కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆదివారం కాలినడకన ఊర చెరువుకు వెళుతుండగా పిట్లం-మద్దెల చెరువు రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. స్థానికులు బాన్సువాడ దవాఖానకు తరలించగా దవాఖానలో మరణించాడు. మృతుడి భార్య షేక్ బెజన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జేపీఎన్ రోడ్‌లో చెత్త తొలగింపు

జేపీఎన్ రోడ్డులో చెత్తను తొలగించిన బల్దియా అధికారులు

కామారెడ్డి, డిసెంబర్ 29 : జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో 'ఎక్కడి చెత్త అక్కడే..' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో ఆదివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని జేపీఎన్ రోడ్‌లో ఉన్న లేబర్ అడ్డా వద్ద చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్పందన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద చెత్త కుండీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు ఎవరూ చెత్తను రోడ్లపైన వేయొద్దని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేసి చెత్త సేకరణకు ఆటోలు వచ్చినప్పుడు అందులో వేయాలని సూచించారు.

డ్రగ్స్ జోలికి పోవద్దు

కామారెడ్డి, డిసెంబర్ 29: నూతన సంవత్సరం సందర్భంగా యువత గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేని ప్రదేశాలు, హోటళ్లు, దాబాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫంక్షన్ హాల్స్ వారు తప్పకుండా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనుమతి తీసుకోవాలని తెలిపారు. నూతన సంవత్సరం వేడుకల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పోటీలకు తరలిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి, డిసెంబర్ 29: వరంగల్‌లో ఈనెల 30 నుంచి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ 2024 పోటీల్లో పాల్గొనే ఖోఖో మెన్, ఉమెన్ జట్లు ఆదివారం బయల్దేరి వెళ్లాయి. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సెక్రటరీ అతీఖుల్లా, కోశాధికారి మధుసూదన్ రెడ్డి, యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీస్ జిల్లా అసిస్టెంట్ రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు నరేశ్ రెడ్డి, సురేశ్, సంజీవ్, లింగం, విజయలక్ష్మి, ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత వైద్య శిబిరం

నస్రుల్లాబాద్, డిసెంబర్ 29: బీర్కూర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ వాసవి ఈఎన్‌టీ దవాఖాన, శ్రీ సాయి హియరింగ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెవి, ముక్కు, గొంతు సమస్యలు ఉన్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు గాలయ్య, సభ్యులు విఠల్, సంతోష్, రషీద్, దత్తు, రమేశ్, గంగారాం, ఆవారి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నస్రుల్లాబాద్, డిసెంబర్ 29: బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామానికి చెందిన లక్కపల్లి గంగవ్వ(60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గంగవ్వ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 26వ తేదీన భోజనం చేసింది. ఆమెతోపాటు కొడుకు, కోడలు, మనవడికి ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో స్థానికులు గమనించి వారిని బాన్సువాడ వంద పడకల ఏరియా దవాఖానకు తరలించారు. గంగవ్వ పరిస్థితి విషమంగా ఉండడంతో 27వ తేదీన నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. కాగా.. గంగవ్వ చికిత్స పొందుతూ 28వ తేదీన మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె అంత్యక్రియలను ఆదివారం గ్రామంలో నిర్వహించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కులస్తులు

కామారెడ్డి, డిసెంబర్ 29: బేడ బుడగ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కాలేజీలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండపల్లి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా సంకు పోచయ్య, కోశాధికారిగా పొనకంటి నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఒంటెద్దు సంగమేశ్, ప్రధాన కార్యదర్శిగా కళ్లెం రవి, కోశాధికారిగా ఇప్ప నవీన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు తిరుపతి, రాజు, వెంకటి, అల్లం శీను, లక్ష్మీపతి, రవి, ప్రసాద్, కళ్లెం స్వామి, పుల్లయ్య, పండరి, సాయిలు, చంద్రయ్య, కాశీరాం, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భిక్కనూరు, డిసెంబర్ 29: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సమీర్‌ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతోవిద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజేందర్, యోగేశ్, సందీప్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో కోలాటం ఆడుతూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నిజాంసాగర్ కస్తూర్బాలో నిరసన వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు

కోలాటం ఆడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

- కొనసాగుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన

కామారెడ్డి, డిసెంబర్ 29: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం 20వ రోజు కామారెడ్డి మున్సిపల్ ఆఫీస్ వద్ద రోడ్డుపై కోలాటం ఆడుతూ నృత్యం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చేస్తున్న పోరాటంలో ఏ రాజకీయ నాయకులు లేరన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల పోరాటం స్వశక్తిదని, ఇది దశాబ్దాల బానిసత్వానికి విముక్తి పొందడానికి చేస్తున్న ఆరాటమన్నారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కొంత సానుకూలత చూపించినప్పటికీ స్పష్టమైన స్పందన లేదన్నారు. ఇప్పటికే విద్యా బోధన బంద్ చేసి రోడ్డు ఎక్కామని, రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, కాళీదాసు, వీణ, సాయిలు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి నిరసన..

నిజాంసాగర్, డిసెంబర్ 29 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆదివారం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరూ 20 రోజులుగా సమ్మె చేస్తున్నా.. వారి సమస్యలు పరిష్కరించకుండా కస్తూర్బాలో ప్రత్యేక అధికారులను నియమించారని, వారికి పుష్పగుచ్ఛం అందజేసి నిరసన తెలిపామన్నారు. ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, తమను విద్యాశాఖలో విలీనం చేసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజాంసాగర్ ఎంఈవో వై.తిరుపతిరెడ్డి, మహ్మద్‌నగర్ ఎంఈవో ఎల్.అమర్‌సింగ్, కేజీబీవీ ఇన్‌చార్జి, స్పెషల్ ఆఫీసర్ సమత, ఏంఐఎస్ కో-ఆర్డినేటర్ జె.రాజు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మాలల సంక్షేమం కోసం కలిసికట్టుగా పోరాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం బాధ్యుడు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 29: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ, మాలల సంక్షేమం కోసం మాలలంతా కలిసి కట్టుగా ఉండాలని ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైసయ్య అన్నారు. మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో మాల సంఘం సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల కులస్తులు ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాల కులస్తులు నష్టపోతారని తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సంగోజీపేట్, కాద్లాపూర్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. త్వరలో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పుతామని తెలిపారు. సమావేశంలో అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు మన్నె చిన్న సాయిలు, ఏఎంసీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, గంగారాం, సురేశ్, పుండరి సంతోష్, డాక్టర్ సాయిలు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

8న బీసీ విద్యార్థుల 'సమరశంఖారావం'

కామారెడ్డి, డిసెంబర్ 29: కామారెడ్డిలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీసీ విద్యార్థుల సమర శంఖారావం గోడ ప్రతులను బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ జనవరి 8వ తేదీన ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనికోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల సాయిగౌడ్, నాయకులు శ్రీనివాస్, హరి, వెంకటేశ్, ప్రసాద్, రమేశ్, అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సమర శంఖారావం గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

మకర సంధ్య మాసపత్రిక ఆవిష్కరణ

కామారెడ్డిలో మకరసంధ్య మాస పత్రికను ఆవిష్కరిస్తున్న మాలధారులు

కామారెడ్డి, డిసెంబర్ 29: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప నగర్‌లో ఉన్న అయ్యప్ప దేవాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మకర సంధ్య మాస పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేరళ ఆలయ సహాయ అర్చకుడు ఉన్నికృష్ణన్ నంబూత్రి, వేద పండితుడు గంగవరపు ఆంజనేయ శర్మ, ఆలయ అర్చకుడు కన్న య్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు రాజేందర్, కార్యనిర్వహణ అధ్యక్షుడు పట్నం రమేశ్‌తోపాటు బాస రఘు, ఉదయ్, కుంబాల రవియాదవ్, శ్రీధర్, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.